# ఏనుగులూ - ఎలుకలూ

వెనక చింతగుమ్మలపల్లిలో సుబ్బారాయుడిగారి తాతగారికి మీసం ఉన్నదా లేదా అని ఓ ప్రశ్న వచ్చింది. సుబ్బారాయుడుగారు ఓనాటి సంజెవేళ ఊరిమధ్యనున్న మర్రిచెట్టుకింద కూర్చుని తను అల్లారు ముద్దుగా పెంచుతున్న కుచ్చు మీసాన్ని వజ్రాంగుళీయక విరాజమానమైన తన చూపుడువేలుతో దువ్వుకుంటూ 'ఈ మీసం మా తాతముత్తాతల కాలంనుంచీ వొస్తోందీ, ఇది మా వంశగౌరవానికి జెండాలాంటిదీ' అన్నారు. అనటవేవిటి ఆ మాట నెప్లాంబాంబులా పాకిపోయింది. సుబ్బారాయుడిగారిపేరు చెప్తేనే భగభగమండిపోయే వెంకట్రాయుడిగారిముఠా రిసెర్చి ప్రారంభిచారు. రోగస్థులైన ముసలివాళ్ళనుంచి ఆరాలు తీశారు. కొనప్రాణాలతో ఉన్న శత వృద్ధుల్ని ఇంటర్వ్యూ చేశారు. మూణ్ణెల్లకోసారి సుబ్బారాయుడి తాతగారికి క్షవరం చేసే మంగలి ప్రస్తుతం కళ్ళుపోయి మంచాన పడివున్నాడు. అతనిచేత సాక్ష్యం పెట్టించారు. అంతా ఫైనలైజ్ చేసి సుబ్బారాయుడి తాతగారికి అసలు మీసమే లేదని ప్రకటించారు. తాతకు లేని మీసం మనవడికేల అని వూరంతా దప్పువేయించారు.

ఇది విన్న సుబ్బారాయుడిగారికి నూటఆరు జ్వరం వచ్చింది. మరుగుతున్న నూనెలో వేయిస్తున్న బజ్జీలా అయిపోయాడు. ఆరాత్రే ముసలి మంగలాడి గుడిసె కాస్తా తగలడిపోయింది. దాంతో అతగాడు కాస్తా గుటుక్ మన్నాడు. మర్నాడు బీటికి వెళ్ళిన వెంకట్రాయుడి నాలుగుజతల ఎద్దులు తిరిగి ఇంటికి రాలేదు. ఆరాత్రి సుబ్బారాయుడి కుడిభుజంలాంటి వాడి కాళ్లు విరగ్గొట్టబడ్డాయి. మర్నాడు అర్ధరాత్రి వేళ వెంకట్రాయుడి పక్షంవాళ్ళ ఇళ్ళు తగలబడ్డాయి. సరిగ్గా అదే సమయంలో సుబ్బారాయుడి ముఠావాళ్ళ ఇళ్ళు పరశురామప్రీతి అయ్యాయి. అందరూ అవతలి వాళ్ళ ఇళ్ళకు నిప్పెట్టడంలో నిమగ్నమై ఉండటంవల్ల నిప్పు ఆర్పుకునే తీరికలేక ఊరు ముప్పాతికవంతు బూడిదైపోయింది. విరిగిపోయిన కప్పులు, కాలిపోయిన నల్లటి దూలాలు, ఇంకా సన్నగా పొగ రేగుతున్న బూడిదలమధ్య రెండు డాబా ఇళ్ళు నిక్షేపంలా తొణకకుండా ఉన్నాయి. అవి సుబ్బారాయుడి, వెంకట్రాయుళ్ళవి.

'శంసమ్'